
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25మార్చి 2023





చంద్రబాబు నాయుడుని కలిసిన ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు
మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడిని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వివరాలను నాగేశ్వరరావు, చంద్రబాబు నాయుడికి వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాగా కష్టపడి పనిచేశారని చంద్రబాబు నాయుడు అభినందిస్తూ, రాబోయే ఎన్నికల కోసం ఇదే ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని నాగేశ్వరరావుకు సూచించారు.



వైసిపి ఎంఎల్ఎలపై సస్పెన్షన్..!

- ఆనం, కోటంరెడ్డి, మేకపాటి పై వేటు
- టిడిపిలో చేరేందుకు సమాయత్తం
- జిల్లాలో రాజకీయ కలకలం

రాజకీయంగా ఎంతో విశిష్టత కలిగిన జిల్లాలో ఒక్కసారిగా కలకలం మొదలైంది. కొద్ది కాలంగా వైసిపి ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేసిన మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు, తాజా ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై వైసిపి అధిష్టానం శుక్రవారం సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించింది. మేకపాటి దీనిని స్వాగతించారు. అధిష్టానం పెద్దలే ఇలా చేశారు, తనకు సంతోషంగా ఉందన్నారు. ఆనం రామనారాయ ణరెడ్డి రెండు రోజుల్లో భవిష్యత్తు కార్యక్రమం చెబుతామన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఇలాంటి చర్యలు అప్రజా స్వామ్యకం మన్నారు.


ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి


ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి


ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
జిల్లా రాజకీయ చరిత్రలో ఇదో విచిత్రమైన సంఘటన ఓ రాజకీయ పార్టీకి చెందిన ముగ్గురు ఎంఎల్ఎలను వైసిపి అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎంఎల్ఎ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు వేశారనే ఉద్దేశంతో శుక్రవారం ఆపార్టీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇద్దరు ఎంఎల్ఎల ఆనం రామనారా యణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారు. తాజాగా ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆ జాబితాలో చేరారు. ఒకేసారి ముగ్గురు ఎంఎల్ఎలను సస్పెండ్ చేయడంతో రాజకీయంగా రాష్ట్ర వ్యాపి తంగా చర్చగా మారింది. కోట ంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామ నారాయణరెడ్డిలు కొంత కాలంగా వైసిపి ప్రభుత్వ విధానాలపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. బహిరంగంగా విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా కోటంరెడ్డి, ఆనంను పార్టీకి దూరంగా పెట్టారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వాని చండం లేదు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్టోబర్‌లో టిటిపిలో చేరడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆనం రామనారా యణరెడ్డి పార్టీ వీడాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి కొంత సమయం తీసుకో వాలని నిర్ణయం తీసుకు న్నారు.ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గత కొంత కాలం పార్టీపై అసం తృప్తితో ఉన్నారు. ఆయనకు టికెట్ రాదని, కొత్త వ్యక్తి వస్తారని ప్రచారం చేస్తున్నారు. వైసిపి అధిష్టానంలోని కొందరు నేతలు ఆయనపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం అసెంబ్లీలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో నలుగురు వైసిపి అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అందులో జిల్లా నుంచి ముగ్గురు ఎంఎల్ఎలు ఉన్నారని, వైసిపి అధిష్టానం నిర్ణయానికి వచ్చింది. గురువారమే ఈ విషయం గ్రహించిన నేతలు శుక్రవారం ముగ్గురు ఎంఎల్ఎలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది కొత్తమే కాకపోయినా, కొత్తగా ఉదయగిరి ఎంఎల్ఎ ఈ జాబితాలో చేరడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. పది మంది ఎంఎల్ఎలున్న చోట ముగ్గురు ఎంఎల్ఎలు పార్టీపై తిరుగుబావుటా ఎగురవేయడంతో వైసిపిలో ఆందోళన నెలకొంది. వైసిపి నిర్ణయం పట్ల సస్పెండ్ అయిన నేతలు స్పందిం చారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లా డుతూ తమకు కనీసం షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఇలా నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ నిర్ణయంతో రెండు రోజుల్లో తన భవిష్యత్తు కార్యక్రమాలు చెబుతానన్నారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎంతో ఆనందంగా ఉందని, వైసిపిలోని కొందరు పెద్దలు కావాలనే ఇలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయం ఎలా ఉంటే అలా సాగుతు ందన్నారు. ఈ పరిణా మాలతో జిల్లా రాజకీయం రాష్ట్ర చరిత్రలో వింతగా, విచిత్రంగా మారింది.

2025 నాటికి క్షయ రహిత జిల్లా

ప్రజాశక్తి-నెల్లూరు:జిల్లాను 2025 నాటికి క్షయవ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని డిటిఒ డాక్టర్ జి.వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ పెంచలయ్య జెండా ఊపి ప్రారంభించగా సంతపేట ప్రాంతంలోని సెయింట్ జోసెప్ హాస్పిటల్ నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 2022 గణాంకాలను అనుసరించి 40 వేల మంది గళ్ల పరీక్షలు చేసుకోగా 3,804 మందికి టి.బి నిర్ధారణ అయిందన్నారు.

వీరందరికీ చికిత్సలు అందజేయడంతోపాటు డిబిటి ద్వారా నెలకు రూ.500లు చొప్పున రూ.3 వేలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలోని సమావేశ మందిరంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చివరగా జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు విశేషంగా కృషి చేసిన సిబ్బందికి ప్రోత్సాహకంగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు.

కార్యక్రమంలో కావలి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బ్రిజిత, మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ పవిత్ర, బొల్లినేని నర్సింగ్ కళాశాల, సుచరిత నర్సింగ్ కళాశాల సిబ్బంది, ప్రయివేట్ ప్రాక్టీషనర్స్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-రాపూరు: శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఉదయం గం: 8.00లకు హుండీలు లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ నెల్లూరు అధికారి వారు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ధర్మకర్తల సభ్యులు, మండల రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది దేవస్థానం రిలీజియస్,సెక్యులర్ సిబ్బంది, దేవస్థానం మోతకాపులు, రిటైర్డ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారు. ఈ హుండి లెక్కింపు కార్యక్రమంలో ఎలాంటి బంగారు, వెండి అభరణాలు లేకుండా పంచ ,ధోవతి ధరించి పాల్గొనవచ్చునని తెలిపారు.

డాక్టర్ జి.వి.ఆర్ హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా



ప్రజాశక్తి-నెల్లూరు
ప్రజా వైద్యుడు.. జన విజ్ఞాన వేదిక కన్వీనర్.. నెల్లూరు హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ జి. విజయకుమార్ హత్య కేసుకు సంబంధించి మొదటి అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి మృతుడు డాక్టర్ జి.విజయకుమార్ భార్య వి.ఉషారాణి, న్యాయవాది కునిశెట్టి శ్రీధర్, మృతుని కుమారుడు జి.సుందరయ్య, ఎం. గంగరాజు, పి.రాజులపై హత్యానేరారోపణలు రుజువు కావడంతో వీరందరికీ యావజ్జీవ శిక్షతోపాటు నిందితులు ఒకొక్కరికి రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. కర్నూల్ మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించి పిపిసిలో డాక్టర్‌గా సేవలందించి ప్రజా వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.అదే సమయంలో జన విజ్ఞాన వేదిక కన్వీనర్‌గా వ్యవహరించి సైన్సు ఉద్యమాన్ని జిల్లాలో నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఓ అద్దె భవన సముదాయంలో నెల్లూరు హాస్పిటల్‌ను స్థాపించి ప్రజలకు వైద్యసేవలందిస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. ఈ క్రమంలో కుటుంబంలో వివాదాలు ఏర్పడడంతో భార్యతో విడిపోయి పోస్టల్ కాలనీ ప్రాంతంలోని తల్లి వద్దనే ఉండేవారు. కుమారుడు జి.సుందరయ్య మాత్రం నానమ్మ దగ్గర ఉన్న తండ్రి వద్దకు అప్పుడప్పుడూ వచ్చివెళ్తుండేవాడు. భర్తకు సంబంధించిన ఆస్తిని చేజిక్కించుకోవాలన్న దురాలోచనతో తన భర్తను హతమార్చాలను భార్య ఉషారాణి వ్యూహరచన చేసింది. తన వ్యూహాన్ని అమలు చేసేందుకు న్యాయవాది శ్రీధర్, కుమారుడు జి.సుందరయ్యతో కలిసి పథకాన్ని అమలు చేసేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. తమ పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు ఎం.గంగరాజు, పి.రాజు అను ఇద్దరు కిరాయి హంతకుల సహాయం తీసుకున్నారు. ఈ క్రమంలో 2015 మే 28వ తేదీనా అర్ధరాత్రి డాక్టర్ విజయకుమార్ పోస్టల్ కాలనీలోని ఇంట్లో ఆదమరిచి నిద్రిస్తున్న విషయాన్ని కుమారుడు సుందరయ్య గుర్తించాడు. వెంటనే తల్లికి, మిగిలిన సభ్యులకు సమాచారం అందజేసి ఇంటిలోకి దొంగచాటుగా ప్రవేశించేందుకు మార్గం కల్పించాడు. పడకగదిలో ఆదమరిచి నిద్రిస్తున్న డాక్టర్ విజయకుమార్‌ను నలుగురు సభ్యులు కదలకుండా గట్టిగా పట్టుకోగా మరొకరు గొంతు నులిమి హత్యకు పాల్పడ్డారు. తెల్లవారగానే గుండెపోటుతో డాక్టర్ విజయకుమార్ మృతి చెందారంటూ చిత్రీకరించి హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమైపోయారు. డాక్టర్ విజయకుమార్ మరణ వార్త విన్న స్నేహితులు, అనేక మంది డాక్టర్లు ఘటనా స్థలానికి చేరుకొని మిత్రుడి భౌతికకాయాన్ని పరిశీలించిన కొందరు వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని డాక్టర్ విజయకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన ప్రభుత్వ వైద్యులు డాక్టర్ విజయకుమార్ కు ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి విచారణ జరిపారు. సిసి టివి కెమరా ఫుటేజీలు సేకరించారు. భార్య, కుమారుడు, న్యాయవాది శ్రీధర్ మరో ఇద్దరు ఆయన్ను హత్య చేశారని నిర్ధారించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు 2015 నుంచి 8 ఏళ్ల పాటు 26 మంది సాక్షులను కోర్టులో విచారణ చేపట్టారు. 8 ఏళ్ల పాటు కోర్టులో సాగిన ఈ కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా మూర్తి, కె.బి.ఎన్ మణి, విజయమ్మ, కుడుముల రవిలు వ్యవహరించారు. కేసు విచారణ సమయంలో కోర్టుకు సాక్షులు చెప్పిన వివరాలు, వాదనలను పరిగణలోకి తీసుకొని మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సి.సత్యవాణి నిందితులు ఐదుగురికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పడంతో పాటు ఒకొక్కరికి రూ.5 వేలు జరిమానా విధించారు. ప్రజా వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ విజయకుమార్ హత్య కేసులో కోర్టు సరైన తీర్పును వెల్లడించిందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:మండలంలోని శాఖవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా హిందీ పండిట్ బివి రమణ పదో తరగతి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఎలా రాయాలి, ఆరోగ్యంగా ఎలా ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించారు.



పరీక్షా సమయంలో భయాందోళనకు గురికావద్దన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం బివి రమణను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు డిఎస్‌కెవి ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైఎస్ఆర్ ఆసరా పథకంతో ఆర్థిక భరోసా
-డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కె.వి.సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు+రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కె.వి.సాంబశివారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని డిఆర్‌డిఎ కార్యాలయంలోని పి.డి ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరు ప్రాంతంలో వైఎస్ఆర్ ఆసరా పథకం మూడవ విడత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని, అందులో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు హాజరు కానున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాల్లో ఒకటి వైఎస్ఆర్ ఆసరా పథకమన్నారు. ఈ పథకాన్ని డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం ఏప్రిల్ 11, 2019 నాటికి బ్యాంకు అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లాలో 34,443 గ్రూపులకు చెందిన 3,29,815 మంది సభ్యులకు 1074.39 కోట్ల రూపాయలు బకాయిగా చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బకాయిలను ప్రభుత్వం నాలుగు దశలల్లో చెల్లించి మాఫీ చేస్తామని పాదయాత్రలు చేసే సమయంలో హామీ చేశారన్నారు. అందులో భాగంగా మొదటి విడతగా 2020–21వ సంవత్సరంలో 31,569 గ్రూపులకు చెందిన 3,09,877 సభ్యులకు రూ. 250.23కోట్లు, రెండవ విడతగా 2021–22వ సంవత్సరంలో 34,323 గ్రూపులకు చెందిన 3,28,646 సభ్యులకు రూ.285.18 కోట్లు , మూడవ విడతగా 34,443 గ్రూపులకు చెందిన 3,29,815 సభ్యులకు రూ.290.17 కోట్ల నగదు బ్యాంకుల ఖాతాలల్లో జమ చేస్తుందన్నారు. 3వ విడతగా రాష్ట్ర , జిల్లా స్థాయిలో వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఈ నెల 26వ తేది నుంచి ఏప్రిల్ 5వ తేది వరకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని మండల కేంద్రంలో శాసనసభ్యుల చేతుల మీదుగా ఆ మండలంలో అర్హులైన స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండ విడతలుగా , సుమారుగా 530 కోట్లు జమ చేయగా మూడవ విడతగా 290 కోట్లు జమచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయ సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.



చిరుధాన్యాల (మిల్లేట్) మహోత్సవం

చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, ఏయే పోషక విలువలు లభ్యమవుతాయో అవగాహన కల్పించేందుకు డిఆర్‌డిఎ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న చిరుధాన్యాల (మిల్లేట్) మహోత్సవానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో (ఆసరా) స్వయం సహాయక సంఘాలకు చెందిన వెయ్యి మంది మహిళాసభ్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

టీడీపీ విజయోత్సవ వేడుకలు..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధించడా న్ని పురస్కరించుకొని మండలంలోని నరుకూరు గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ విజయో త్సవ వేడుకలు నిర్వహించింది. టీడీపీ ఎంపీటీసీ సభ్యులు కొణతం రఘుబాబు విజయో త్సవ వేడుకల్లో స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొ న్నారు. విజ యోత్సవ ర్యాలీ అనంతరం కేక్ కట్ చేసి తమ సంతోషం వ్యక్తం చేశారు. పంచుమర్తి అనురాధ గెలుపు పై హర్షం వ్యక్తం చేశారు.



అనురాధకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 23న జరిగిన ఎమ్మెల్యే కోటా ఎంఎల్‌సి ఎన్నికలలో అఖండ విజయం సాధించిన విజయవాడ నగర మాజీ మేయర్ పంచుమర్తి అనురాధకు కందుకూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం కందు కూరు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శివరాం మాట్లాడుతూ చట్ట బద్ధంగా, రాజ్యాంగబద్ధంగా అసెంబ్లీ నామినల్ రూల్స్ ప్రకారం తెలుగుదేశం పార్టీకి 23 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయనే విషయం తెలుసుకోకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సకలశాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి, కొంతమంది నాయకులు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పంచుమర్తి అనురాధను ఏవిధంగా పోటీకి నిలబెట్టారో సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీలో ఏ పార్టీకి ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో తెలుసుకోలేని దుస్థితిలో అధికార వైసిపి నాయకులు ఉండడం ఎపికి పట్టిన దౌర్భాగ్య పరిస్థితి అని ఎద్దేవా చేశారు. మార్చి 13న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఉమ్మడి తొమ్మిది జిల్లాల పట్టభద్రులు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంత్రులు, వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై శివరాం ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడిన అనిశ్చితికి కారణమైన వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపడానికి అన్నివర్గాల ప్రజలు ఏకమయ్యారని చెప్పడానికి పట్టభద్రుల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అఖండ మెజారిటీతో గెలవడమే ప్రత్యక్ష ఉదాహరణ. ఇకనైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమాన్ని దగ్గరకు తీసుకురావడం, సలహాతో కూడిన సూచనలు ఇచ్చారు. సమావేశంలో కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, కందుకూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, ముస్లిం మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, కందుకూరు పట్టణం ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ సలాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ దివి శివరాం

టిడిపి విజయంతో వైసిపి బెంబేలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం కొట్టిన దెబ్బకు వైసిపికి కోలుకొని దెబ్బ తగిలిందని టీడీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి ఏద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన మండలంలోని వరకవిపూడిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లా డారు. మొన్న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావు లు టీడీపీకి భారీ మెజార్టీ కట్ట బెట్టారన్నారు. ఎమ్మెల్యే ఎంఎల్‌సి ఎన్నికల్లో మళ్లీ టీడీపీకి అవకాశం కల్పించారని సురేష్ రెడ్డి పేర్కొన్నారు. 23వ తేదీకి 2023 సంవత్సరం 23 ఓట్లతో గెలిపించి పంచుమర్తి అనురాధను గెలిపించి వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారని ఆయన చెప్పారు. ఎమ్మెల్యేల బలం లేకపోయినా టీడీపీ అభ్యర్థిని గెలిపించి మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తన స త్తా ఏమిటో రుచి చూపించారన్నారు.


సన్నారెడ్డి సురేష్‌రెడ్డి

ఉచితంగా వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కందుకూరు: స్థానిక కోటారెడ్డి ఆసుపత్రిలో కందుకూరు పోలీసు సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 130 మందికి, సుమారు రూ.1,70,000విలువ చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేసిన డాక్టర్ శివ కుమార్ రెడ్డికి, డాక్టర్ సాకేత్ రెడ్డికి కందుకూరు డిఎస్పీ కండే శ్రీనివాసులు పోలీసు సిబ్బంది తరపున శుక్రవారం ధన్యవాదాలు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం పాదయాత్ర

ప్రజాశక్తి-గుడ్లూరు: ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం పాదయాత్ర చేపడుతున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశంలో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రను ఎంఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు మాదిగ ప్రారంభించారు.

గ్రామాల్లో గ్రామసభలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు సామాజిక తనిఖీ బృందం వారు మండలానికి వచ్చినట్లు ఆ పథకం ఎపిఒ షేక్ సమీర్‌బాషా గురువారం తెలిపారు. శుక్రవారం నుండి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రీ-నోటిఫికేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశంకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆన్‌లైన్ విధానం తికమక వలన తీవ్రంగా నష్టపోయినట్లు వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఫిబ్రవరి 25వ తేదిన ప్రకటించిన నోటిఫికేషన్‌లో కందుకూరు డివిజన్ నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్నట్లుగా చూపారు. అనంతరం మార్చి 18వ తేది తర్వాత ఆన్‌లైన్‌లో ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు కందుకూరు డివిజన్‌ను ఉమ్మడిగా కేటాయించారు.

దీంతో 18వ తేదికంటే ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రకాశం జిల్లాలోని పాఠశాలలు వర్తించలేదు. దీంతో తాము నష్టపోయి నట్లు తల్లిదండ్రులు ఆవేదన చెందు తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రీనోటిఫికేషన్‌ను ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తద్వారా పేద పిల్లలందరికీ న్యాయం చేసినట్లవుతుందని వారు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణకు జాగ్రత్తలు

ప్రజాశక్తి-పొదలకూరు: జిల్లా క్షయ నిర్మూలనా అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు మహమదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ సూచనలతో క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విఘ్నేశ్వర పురం కాలనీలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టి.రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు అనురాధ, బి.రమణమ్మ, ఆరోగ్య సహాయకులు రాధా కుమారి, సాని శివ ప్రసాద్, కామాక్షమ్మ, మునిరాధిక ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కోటంరెడ్డి' టిడిపిలో చేరిక..!

- ..కండువ కప్పి చంద్రబాబు ఆహ్వానం
- ..నెల్లూరు నుంచి భారీ కార్ల ర్యాలీ
- ..టిడిపి రూరల్ నేతల అలక

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సొదరులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శుక్రవారం మంగళగిరిలో టిడిపి కార్యాలయంలో చంద్రబాబు నాయుడు సమక్షంలో చేరారు. నెల్లూరు రూరల్ నుంచి శుక్రవారం ఉదయం పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కార్లతో ర్యాలీగా వెళ్లారు. కోటంరెడ్డితోపాటు పలువురు కార్పొరేటర్లు, నేతలు టిడిపిలో చేరారు. జిల్లా నుంచి పలువురు నేతలు వెళ్లినా టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పార్టీ సీనియర్ నేతలు పొలిట్‌బ్యూరో సభ్యులు ఈ సమావేశానికి వెళ్లలేదు. పార్టీ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యవహరించినట్లు తెలుస్తోంది. పార్టీలో చేరిన కోటంరెడ్డి గరిధర్ రెడ్డిని పలువులు నేతలు అభినందించారు.


పార్టీ కండువా కప్పుతున్న చంద్రబాబునాయుడు

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి టిడిపి జాతీయ ప్రధాన అధ్యక్షులు నారా చంద్రబాబానాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఉదయం నగరంలోని కస్తూరిదేవి గార్డెన్ నుంచి సుమారు 300 కార్లతో విజయవాడ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడక్కడా టిడిపి నేతలు వారికి స్వాగతం పలికారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గిరిధర్‌రెడ్డి మెడలో కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో విసిగి వేసారిన నేతలు టిడిపి వైపు చూస్తున్నారని, అందుకే కోటంరెడ్డి వంటి వారు టిడిపిలోకి వస్తున్నారన్నారు. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, అది ఇప్పుడు బయటకొచ్చిందన్నారు. మరికొందరు వైసిపి నుంచి టిడిపిలోకి వస్తారన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. రాష్ట్రంలో మళ్లీ బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకే తాను టిడిపిలో చేరుతున్నానని, ఒక కార్యకర్తగా ఉంటానన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితోపాటు నగర వైసిపి అధ్యక్షులు తాటి వెంకటేశ్వర్లు, మేయర్ భర్త జయవర్ధన్, కార్పొరేటర్లు, నాయకులు, అవర శ్రీనివాసులు, మధన్‌కుమార్‌రెడ్డి, హాజరత్ నాయుడు, రమేష్‌తోపాటు అనేక మంది కార్పొరేటర్లు, నేతలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తోపాటు నెల్లూరు రూరల్ టిడిపినేతలు ఎవరూ హాజరుకాలేదు. అధిష్టానం సరైన సమాచారం ఇవ్వకుండా కోటంరెడ్డి సోదరులను టిడిపిలోకి ఆహ్వానించడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తిచేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్ఎలు కొమ్మి లక్ష్మయ్యానాయుడు, కంభం విజయరామిరెడ్డి, పాశం సునీల్‌కుమార్, టిడిపి నేతలు పోలంరెడ్డి ధినేష్‌రెడ్డి, గుటూరు కన్నబాబు, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనితకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు
కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత జన్మదిన కార్యక్రమం కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి, పట్టణ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి బత్తిన ఆదెమ్మ, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి కల్లూరి శైలజ, రాష్ట్ర నాయకులు చిలకపాటి మధు బాబు, చదలవాడ కొండయ్య, పార్లమెంటు నాయకులు గోచిపాతల మోషే, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, పార్టీ నాయకులు వడ్డెళ్ల రవిచంద్ర, సలాం, చుండూరి శీను, ఫిరోజ్, బద్దిపూడి శిఖామణి, లింగాబత్తిన మాల్యాద్రి, అక్కిలగుంట ప్రకాశం, మహిళా నాయకులు అత్తంటి శ్రీలక్ష్మి, హారిక, మయూరి, పిడికిటి లక్ష్మి ఇతర నాయకులు పాల్గొన్నారు.



21న బాడీబిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - కావలి : స్థానిక పీహెచ్ఆర్ కళ్యాణ మండపంలో మే 21వ తేదీన ఉదయం 10గంటల నుండి మిస్టర్ సింహపురి స్ట్రీమెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ 2023 రాష్ట్రస్థాయి మెన్ అండ్ ఉమెన్ ఫిజిక్స్ ఛాలెంజ్ బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన గోడపత్రికలను నిర్వాహకులు ఆవిష్కరించారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బి.జగన్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.మాధవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె.ముజీబ్, మస్తాన్‌బాషాలు పాల్గొని ఈ పోటీలు 6కేటగిరీలుగా జరుగుతాయన్నారు. ఒక్కో కేటగిరికి 3బహుమతులు, చాంపియన్‌కి రూ.30,000 మొత్తం బహుమతుల విలువ రూ.2లక్షలు, ఫిజిక్స్ ఛాలెంజ్-1, ఉమెన్ కేటగిరి ఒకటి లెక్కన బహుమతులు ఇస్తామని వివరించారు.

విట్స్‌లో ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు

ప్రజాశక్తి - కావలి : జెఎన్‌టియు అనంతపూర్ ఎన్.ఎస్.ఎస్. యూనిట్‌కు అనుబంధంగా పని చేస్తున్న కావలి విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్.యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నుండి వారంరోజులపాటు కావలి పరిసర గ్రామమైన జమ్మలపాలెంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వారం రోజులపాటు ప్రతిరోజూ 50మంది వాలంటీర్లు పాల్గొని, గ్రామంలో పలు కార్యక్రమాలు చేపడతారు. సాంఘీక దురాచారాలపై ర్యాలీలు, అక్షరాస్యత, స్త్రీ సాధికారత, నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తారు. కూరగాయల విత్తనాలు గ్రామస్తులకు పంపిణీ చేస్తారు. కరోనా, ఎయిడ్స్, సీజనల్ వ్యాధులు నిర్మూలనకు ప్రజలను సమాయత్తం చేస్తారు. మొదటిరోజైన శుక్రవారం సాంఘీక దురాచారాలపై ర్యాలీలు నిర్వహించారు. ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుండడంపట్ల కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రేయశర్మ హర్షం వ్యక్తం చేశారు.

భగత్ సింగ్‌కు నివాళులు

ప్రజాశక్తి-కావలి : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు. రాష్ట్ర కమిటీ 23 నుండి 30వ తేదీ వరకు లౌకిక భారత రక్షణ కోసం సభలు సమావేశాలు జరపాలని నిర్ణయించిందని పిడిఎస్‌యు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కావలి జేబీ కాలేజ్ దగ్గర ఎస్సీ హాస్టల్‌లో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశ సర్వనాశనం అయిపోయిందన్నారు. కార్పొరేట్ శక్తుల హస్తాల్లో దేశం ఉంది. కార్యక్రమంలో కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మండ శ్రవణ్, నాయకులు నితిన్, ప్రవీణ్, వాసు, తబుకు చరణ, మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవార్డులు

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్వైజర్‌గా పని చేస్తూ క్షేత్ర స్థాయిలో రోగులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న షేక్ బాషా మొహిద్దీన్, పి.హెచ్.సిలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న ఎం.అరుణ్ శుక్రవారం జిల్లా అధికారుల చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం హర్షనీయమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇరువురికి అభినందనలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-మర్రిపాడు : షేక్ ఖాజావలి జ్ఞాపకార్థం వారి కుమారులు ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ విశ్వనాథరెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడికి వచ్చిన ప్రజలకు ఎస్ఐ చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు వారు తెలియజేశారు. ఈ చలివేంద్రంలో స్వచ్ఛమైన తాగునీరును అందించనున్నా మని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పోలయ్య పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : పట్టణంలోని జెడిపి బాలికోన్నత పాఠశాలలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ పదవ తరగతిలో పరీక్షలు రాబోతున్న నేపథ్యంలో విద్యార్థులకు పరీక్షలు రాసుకునేందుకు ప్యాడ్లు పెన్నులు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసులు, సెక్రటరీ శ్రీనివాసరావు, సిబ్బంది డి.శ్రీనివాసులు, కమిటీ సభ్యులు దొర్నాదుల లక్ష్మణమూర్తి, కిరణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి పాల్గొన్నారు.

అధికారులతో సర్పంచ్ సమీక్ష

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు గ్రామ సర్పంచ్ కొండేపోగు దివిలేకుమార్ సచివాలయంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. వర్ష ప్రభావం దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ శానిటేషన్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, కలుషితం కాకుండా అలాగే తాగునీటిని, వీధిదీపాలు చూడాలని వారు బాధ్యత తీసుకుని పనిచేయాలని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు వారి పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అంకం శ్రీనివాసులు, రెవెన్యూ సెక్రటరీ బాబా శేషారెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ షంషీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధీర్ బాబు, ఎఎన్ఎం అనూష పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్‌లో 80మంది ఎంపిక

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ఐఐఎస్ గ్లోబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. బ్యాంకింగ్ సెక్టార్‌కు సంబంధించి నిర్వహించిన ఈ ప్లేస్‌మెంట్‌లో పలు కళాశాలల నుండి 180మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రౌండ్ల పరీక్షలు నిర్వహించిన అనంతరం ఎంఎస్ఆర్ కళాశాలకు చెందిన 80మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గొట్టిపాటి కొండపనాయుడు, సుకుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుడికి చేయూత

ప్రజాశక్తి-కావలి : ఒంగోలు నుంచి వచ్చి కావలి వైకుంఠపురంలో నివసిస్తున్న నాయీబ్రాహ్మణ క్షౌర వృత్తిదారుడు వెంకటేశ్వర్లు అనారోగ్యం పాలయ్యారు. ఏ ఆదరణ లేక ఒంటరిగా ఉన్న వెంకటేశ్వర్లును ఆ వార్డు మాజీ కౌన్సిలర్ గుడ్లూరు మాల్యాద్రి గమనించి, ఒంగోలుకు చెందిన అనిల్, తాళ్లపాలెం సత్యనారాయణలతో కలిసి, వెంకటేశ్వర్లుకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గుడ్లూరు మాల్యాద్రి, తాళ్లపాలెం సత్యనారాయణ, ఒంగోలు అనిల్, ప్రతాప్ పాల్గొన్నారు.

పలుచోట్ల పోషణ పక్వాడ్ సంబరాలు

ప్రజాశక్తి - కావలి



కావలిలో...

కావలి అర్బన్-2 సెక్టారులోని ఇస్లాంపేట, గాయత్రీనగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో జరుగుతున్న పోషణపక్వాడ్ కార్యక్రమాలలో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.వి.సుభాషిణి ఆధ్వర్యంలో శుక్రవారం తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు పోషకవిలువల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ 3నుండి 6సంవత్సరాల లోపల పిల్లలకు బరువు తూచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చే మార్పుల గురించి తెలియజేశారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, ఆహారం వండేటప్పుడు కూడా మూతలు వేసి వండకూడదని, మూతలు వేస్తే పోషక విలువలు ఆవిరిలో బయటకు పోతాయన్నారు. చిరుధాన్యాలు, రాగులతో రాగి రూపం, రాగి ఇడ్లీ, తీసుకుంటే పోషక విలువలు పెరుగు తాయని, ఆరోగ్యం చక్కగా ఉంటుంది న్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మంజుల, అరుణ, ఎఎన్ఎంలు, హెల్పర్లు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట 2, 3 రామస్వామి పాలెం2, అంగన్‌వాడీ కేంద్రాలు సంబంధించిన బాలింతలు గర్భిణులకు, వాలంటీర్లకు, పిల్లలకు విశ్వనాధరావుపేట సచివాలయంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని సర్పంచ్ గందారి మంజుల ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పి నిర్మల, సిహెచ్ లక్ష్మి పి రూప్సిరాణి, సలోమి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : పోషక విలువలున్న ఆహారంపై గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెరగాలని, ఆ దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సిడిపిఒ జ్యోతి సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాలెం 3వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విలువలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన ఆమె మాట్లాడుతూ అందుబాటు ధరల్లో ఉండే చిరు ధాన్యాలు, పాలు, గుడ్లలో సమృద్ధిగా పోషకాలున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వైఎస్ఆర్ కిట్లు, బాలామృతంలో పుష్కలంగా పోషకాలున్నాయని తెలిపారు. పిల్లల బరువును తరచూ పరిశీలిస్తూ పోషకాహారం అందించడం వల్ల చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో సిడిపిఒ అరుణ, సూపర్‌వైజర్ వి.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : చిరు ధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని ఐసిడిఎస్ పిడి సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ముసునూరు గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో "పోషణ పక్వాడ్" వారోత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమతుల్యమైన ఆహారం తీసుకుని, ఆరోగ్యవంతంగా, తల్లీ బిడ్డలు వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ మాలిని దేవీ మాట్లాడుతూ గర్భిణులు అదనపు ఆహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కావలి ప్రాజెక్ట్ సి.డి.పి.ఒ శారద, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, ఐసిడిఎస్ సూపెర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి



నినాదాలు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కాకినాడ జిల్లా, తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో జరిగిన జాతరలో పాల్గొన్న దళిత యువకుడు నడింపల్లి రాముపై అదే గ్రామానికి చెందిన పెత్తందారులు దాడిచేసి హత్య చేసిన వారిని వెంటనే అట్రాసిటీ చట్టం కింద అరెస్టు చేయాలని కోరుతూ కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విఆర్‌సి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ రఘురామయ్య, ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ రాష్ట్రంలో అనునిత్యం దళితులపై దాడులు జరుగుతున్నాయని, దళితులపై దాడి చేసి హత్యలు చేస్తున్నా నిందితులను కఠినంగా శిక్షించకపోవడంతో దాడులు హత్యలు పునరావృతం అవుతున్నాయని ఇప్పటికైనా అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నడింపల్లి రాము కుటుంబానికి 25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, కల్పించాలని, ఇంటి స్థలం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డివిఎంసి మెంబర్ శేషం సుదర్శన్, యునైటెడ్ హ్యూమన్ రైట్స్ నాయకులు పల్లం వెంకయ్య, ఎపి గిరిజన సంఘం అధ్యక్షులు ఏకొల్లు సుధాకరయ్య, కెవిపిఎస్ నాయకులు ఎన్.మోహన్‌రావు, బిసి భాస్కర్, శేషం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో పరిశీలన

ప్రజాశక్తి - కావలి : మండలంలో గురువారం సంభవించిన అకాలవర్షం, ఈదురు గాలులకు దెబ్బతిన్న పంటనష్టాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి జి.సుధాకరరాజు పరిశీలించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామాన్ని సందర్శిం చారు. జరిగిన పంట నష్టాలను, ముంపునకు గురైన వరిపంటను పరిశీలించారు. గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఆయా ప్రాంత రైతులతో చర్చించారు. 38 మిల్లీమీటర్లుగా కురిసిన వర్షానికి కొన్ని పోలాల్లో వరికంకులలో ఉన్నర విత్తనాలు సైతం మెలకలెత్తాయని తెలిపారు. పంటనష్టం 33శాతం కన్నా తక్కువ ఉంటే రైతులకు హెక్టారుకు రూ.15వేలు నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని, నష్టాలను ఈ నెలాఖరులోగా తయారు చేసి పంపుతామని తెలిపారు. కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.కన్నయ్య, వ్యవసాయ అధికారి ఎ.లలిత, వి.ఎ.ఎ.బలరామ్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో రైతులకు లబ్ధి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



సేంద్రియ ఎరువులతో రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కేతా వేణు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం కరటంపాడు చెత్త సంపద కేంద్రంలో రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెత్త కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేస్తుందని ఈ కృత్రిమ ఎరువులను రైతులు అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఎంపిడిఒ సి.శ్రీనివాసులు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో ఆత్మకూరు, చేజర్ల మండల పరిధిలోని నాలుగు గ్రామాలకు చెందిన సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ సహాయకులు పాల్గొన్నారని, వీరు క్షుణ్ణంగా అధ్యయనం చేసుకొని గ్రామాల చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు విస్తరణ అధికారి ఉషారాణి, కరటంపాడు సర్పంచ్ పునుగుంట రేవతి, చేజర్ల విస్తరణ అధికారి బి.రామయ్య, జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉంటాం..

ప్రజాశక్తి-ఉదయగిరి



శాసనసభ్యులు కోటాలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో స్థానిక శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వ్యతిరేకంగా ఓటు వేయడంపై సస్పెండ్ చేయడంపై అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని మాజీ సొసైటీ చైర్మన్ మూలే వినయ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ అతిథి భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడం బాధాకరమన్నారు. పార్టీ ఆయన్ను సస్పెండ్ చేయడం తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. అధిష్టానం తీసుకునే ప్రతి నిర్ణయానికి కట్టుబడి ఉంటామని రానున్న ఎన్నికలు జరగబోతున్నందున నియోజకవర్గాన్ని ఒక సమర్థవంతమైన నాయకుడిని అధిష్టానం నిర్ణయించాలని ఆయన నాయకత్వంలో మండల వైసిపి నాయకులు కష్టపడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు గొల్లపల్లి తిరుపతయ్య, సుభాన్, కోఆప్షన్ నెంబర్ షేక్ సుభాని, మాజీ కో ఆప్షన్ మెంబర్ షంషీర్ మాజీ సర్పంచ్ మూలే సుబ్బారెడ్డి, ఓబుల్ రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వీరారెడ్డి, వీరశేఖర్, గురవయ్య, ఇత్తడి రమణయ్య, యువ నాయకులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తాం.. జెడ్‌పిటిసి



ప్రజాశక్తి-ఉదయగిరి : శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిపై అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జరిగిన శాసనసభ్యుల కోటా ఎన్నికల ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వ్యతిరేక ఓటుపై అధిష్టానం సస్పెండ్ చేయడం నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తూ పార్టీకి అన్ని విధాల అధిష్టాన నిర్ణయించిన నాయకులతో కలిసి 175 సీట్లు గెలుపునకు కృషి చేస్తామన్నారు. గతంలోని ఎంఎల్‌ఎపై వస్తున్న వ్యతిరేకతలను గతం నుండి తెలిపిన నేడు ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ సస్పెండ్‌పై నియోజకవర్గంలో దిష్టిబొమ్మల దగ్ధం చేసి సంబరాలు జరుపుకుంటున్నారని ముఖ్యమంత్రి ఆశించినట్లుగా ఈ ప్రాంతం నుండి ఎంఎల్‌ఎ ఘన విజయాన్ని కానుకగా ఇస్తామన్నారు.

జిఒ110 అమలు

ప్రజాశక్తి-నెల్లూరు

తూర్పు రాయలసీమ ఎంఎల్‌సిగా గెలుపొందిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తన ప్రమాణ స్వీకారోత్సవానికి ముందుగానే ఎన్నికల్లో భాగంగా యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులకు ఇచ్చిన డిజిగ్నేషన్, జీతాలకు సంబంధించి 110జిఒ అమలుకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఎన్నో సంవత్సరాల నుంచి యూనివర్సిటీలలో ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్న అకాడమిక్ కన్సల్టెంట్లు తమ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్లు కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అకాడమిక్ కన్సల్టెంట్లు హోదా ద్వారా వారి అకాడమిక్ డెవలప్మెంట్‌కు ఇబ్బంది కరంగా ఉందని, ఈ క్రమంలో ఎన్నికల సమయం లో వారి సమస్యలను తెలుసుకున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేశారు. ఈ మేరకు జనవరిలో ప్రభుత్వ పెద్దలు, స్టేట్ కౌన్సిల్ చైర్మన్ హేమచంద్రారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అకాడమిక్ కన్సల్టెంట్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం



నూతన సిడిపిఒను సన్మానిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. ఈ మేరకు మండలంలో నూతనంగా ఏర్పడిన అంగన్‌వాడీ ప్రాజెక్టు సమావేశం శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రాజెక్టుకు నూతన సిడిపిఒగా నియమితులైన మాదాసు పద్మావతిని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అన్వర్ బాషా పాల్గొని మాట్లాడుతూ మండలానికి అంగన్‌వాడీ ప్రాజెక్టు రావడం హర్షనీయమని, అంగన్‌వాడీలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించడంలో సిడిపిఒ చొరవ చూపాలని కోరారు. మండలంలో అనేక చోట్ల అంగన్‌వాడీలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో సెంటర్లు నడుపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులతో చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సిఐటియు నాయకులు నాగమణి, సుబ్బమ్మ, సునీత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతి పూజ, పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దువ్వూరు రామ్మోహన్ జ్ఞాపకార్థం వారి సతీమణి భవాని కుమారులు సురేష్, మల్లికార్జున్ వారి కుటుంబ సభ్యుల దాతృత్వంతో సరస్వతి పూజ కార్యక్రమం, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు భోజన కార్యక్రమం, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి వెంకట రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయురాలు కంచి అరుణ, దువ్వూరు భవాని, కలిశెట్టి రాజేంద్రకుమార్, తంగేడుపల్లి సుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు కార్యావుల రమణయ్య, అశోక్, రేవతి, వెంకట రెడ్డి, మురళీకృష్ణ, రబ్బానీ, సురేంద్ర, మాధవరావు, ఓబయ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : బిజ్జంపల్లిలో వార్షికోత్సవ సంబరాలను ప్రధానోపాధ్యాయులు టి వెంకటేశ్వర్లు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ఏప్రిల్ మూడవ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు చదివి మంచి మార్కులతో నూటికి నూరుశాతం ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బండగానిపల్లి పంచాయతీ సర్పంచ్ ఎల్ రమణమ్మ పాల్గొని మాట్లాడారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుందరరంరెడ్డి, మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఎంఇఒ మాలకొండారావు, సర్పంచ్ బీబీజాన్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉత్తమమైన లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించడానికి కృషి చేయాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. హెచ్ఎం శివజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం పాత బిట్రగుంట మాదిగ పల్లికి చెందిన పరుస రమణయ్య (48) కౌలు రైతు శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య పరుసు భరణి కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాల మేరకు.. పరుస రమణయ్య 11 ఎకరాలు కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేస్తున్నారని, 3 ఎకరాలు గురువారం కోసి కుప్పలోరిస్తున్నారని, గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షాలకు పూర్తిగా ధాన్యం తడిసి ముద్దయిపోయింది. మిగిలిన 9 ఎకరాలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిందని, దీంతో మృతుడు మనస్థాపానికి గురై శుక్రవారం ఉదయం బహిర్భూమికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి గుళికల మింగి ఆత్మహత్య చేసుకున్నాడని, కౌలు కోసం కావలి ఐడిఎఫ్‌సి బ్యాంకులో ఇంటిని తాకట్టు పెట్టి రూ.6.50 లక్షలు అప్పు చేశాడని, భార్య ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి విచారణ జరిపి పూర్తి వివరాలు తెలుపుతామన్నారు.

ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో తరుణ్ ఉత్తీర్ణత



ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని విరువూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గుభిలి తరుణ్‌తేజ ఎపి ఎన్ఎంఎంఎస్ 2022- 2023 ఫిబ్రవరి 5న జరిగిన పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణుడై స్కాలర్‌షిప్ సాధించాడు. హెచ్ఎం బి.రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తరుణ్తేజకు అభినందనలు తెలియజేశారు.


ప్రజాశక్తి-మర్రిపాడు : నందవరం ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి మహిత, నవ్య, లహరి, రమ్య ఇటీవల విడుదల చేసిన ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. విద్యార్థినులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : శాసన మండలి ఎన్నికలలో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ ఘన విజయం సాధించడంతో ఆత్మకూరు లోని బి.ఎస్.ఆర్. సెంటర్లో స్థానిక నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు నిర్వహిం చారు. ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ మండలం అధ్యక్షులు సుంకర పెంచల చౌదరి, నెల్లూరు పార్లమెంటు తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, నెల్లూరు పాలెం సీనియర్ నాయకులు మాదాల మస్తాన్ నాయుడు, తోడేటి వెంకటయ్య, తాటిపర్తి పెంచలయ్య, గోరీ షబ్బీర్, రాచూరి రమణయ్య, శేషారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కాజా మస్తాన్, సాగర్, ప్రవీణ్, మంగమ్మ, కాపా వెంకటసుబ్బయ్య, బాలకృష్ణ, డక్కా మల్లికార్జున, డక్కా మహిధర్, చిన్న, నజీర్, పి.రమణయ్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి-అనంతసాగరం : జిల్లా వైద్య శాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో క్షయ వ్యాధి లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఇఒలు నారాయణ, చిన్నయ్య, హెచ్‌విలు శ్యామల, భాగ్యమ్మ, ఎల్ టి మీరాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్నపూర్ణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : క్షయ వ్యాధి అంటువ్యాధి అని, ఈ వ్యాధి నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు నారాయణ హాస్పిటల్ ప్రొఫెసర్ ఫలమనాలజీ డిపార్ట్మెంట్ డాక్టర్ ప్రసన్న పూర్ణ అన్నారు. శుక్రవారం వరల్డ్ టిబి దినోత్సవ సందర్భంగా ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడారు. జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ మునికృష్ణ, ఎఒ డాక్టర్ సురేష్ బాబు, నారాయణ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజేష్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాలాజీ డాక్టర్ అనూష, డాక్టర్ ఆస్మా, నర్సింగ్ సూపరిండెంట్ కమలమ్మ, ల్యాబ్ అసిస్టెంట్ సుధాకర్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, సిద్ధం సుధాకర్, ఎఎంఎంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రెండు వారాలకు మించి ఎడతెరిపిలేని దగ్గు ఉండి గల్ల పడుతుంటే అలాంటివారు క్షయ వ్యాధి పరీక్షలు చేయించు కోవాలని ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ అస్మా తెలిపారు. బీ వరల్డ్ టీబీ డే సందర్భంగా పట్టణంలో అర్బన్ హెల్త్ వైద్యాధికారిణి డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ నుండి ఆర్‌టిసి డిపో వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఫలమనాలజీ వైద్యుడు డాక్టర్ బాలాజీ, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.